# కాపుల సంభాషణ

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు.

లక్ష్మయ్య, సుబ్బయ్య, కోటయ్య.

లక్ష్మయ్య: (జండా భుజానపెట్టుకొని పోతూ ఉంటాడు.)

సుబ్బయ్య: (వెనుకనుంచివస్తూ) అరె! నీమచ్చమాయ, లచ్చుమయ్యా! యాడకిరా, నామాలు, గీమాలు దిట్టంగా దిద్ది ఉరుక్కుంటూ పోతా ఉండావు?

ల॥ ఎక్కడ కంటావేంటి బాబాయి? ఈరోజున భారతస్వాతంత్ర్యోత్సవంగాదూ; ఆ ఉత్స వానికి పోతున్నా.

సు॥ ఎక్కడ చేస్తున్నారురా ఉత్సవం?

ల॥ ఎక్కడేమిటి; ఒకచోటనా. ఊరంతా, దేశమంతా, ప్రపంచమంతా, చేస్తున్నారు.

కోటయ్య: (ప్రవేశిస్తూ) ఏమిటిరా చేస్తున్నది?

ల॥ ఎరగనట్టు ఏమిటంటావేమిటి? నీవందుకు గాదూ వస్తున్నది?

కో॥ ఆఁ నాకదేపట్టింది. మా పడ్డదూడ యాడకో తప్పించుకపోతేను, దాన్ని వెతుక్కోడానికి పోతుండా. అయినా ఏమి సొరాజ్యమోయ్, తింటానికి గింజలు లేకపోయె; కట్టుకోడానికి గుడ్డలు లేకపోయె, అన్నిటికీ కంటరోళ్లూ రేసనింగులు ఆయె. దొంగనిలవలూ, అదికలాబాలు ఆయె. ఇట్టాంటి కాటకంరోజుల్లో ఎందుకొచ్చిన ఉత్సబాలు; ఎందుకొచ్చిన వూరేగింపులు!

సు॥ అదేనయ్యా! నాకుపట్టిన సందేగమూను. ఆనాడేమో సొరాజ్యమొస్తే దేశంలో పజంతా కూటికీ, గుడ్డకూ కరువులేకుండా లచ్చనంగా ఉంటారని లెగిచెర్లిచ్చారు, ఈనాడు సూడబోతే ఏమీ కనపడదు. అన్నిటికీ గిజగిజగానే ఉన్నది. మనగోడు ఆలించేవాడూ పాలించేవాడు కనపడలేదు.

ల॥ అయితే అది స్వరాజ్యం వచ్చినందువల్లనంటావా? యుద్ధం వచ్చినప్పటినుంచీ మనస్థితి యిట్లానే ఉన్నదిగా. అది స్వరాజ్యంమీద రుద్దుతావేం.

కో॥ ఓ, ఆయుద్ధంపోయీ రెండేండ్లాయెగా, అప్పటినుంచి లచ్చనంగా ఉండరాదూ.

ల॥ ఎట్లా ఉంటాము? ప్రపంచ యుద్ధమాయెను, అన్నిదేశాలు దీనిలో చిక్కుకొని చితికిఉండె. మనకు పండేపంట మనకు చాలకపోయె. ఇతరదేశాలనుండి తెప్పించుకొందామంటే వాటి పంటలు వాటికే చాలక ఏడుస్తుండె. అయినా నానాదేశాలనుంచి దొరికిన గింజల్లా మన ప్రభుత్వంవారు తెప్పించి తిప్పలుపడుతునే ఉన్నారుగా?

కో॥ ఆఁ ఆఁ చాలాతిప్పలు పడుతున్నారు. కాబట్టే పదహారుజోన్సులల్లా పన్నెండైంది, పదైంది, ఎనిమిదైంది, యింకా తగ్గుతుందేమో అనిగూడా అంటున్నారు. వాటిల్లోను కొన్ని బియ్యమూ, కొన్ని నూకలూ, కొన్నిజొన్నలూ, కొన్నిదుంపలూ, కాయలూనూ. ఈరిచ్చేరేసను

ఆడపిల్లలు గుడ్డెనగూళ్లు వండుకోడానికి సాలడంలేదు. ఏందిరా యీతిరిపెం? ఇదేనా సొరాజ్యం?

ల || చాలనప్పుడు సర్దుకోవద్దూ? ఎట్లామరి?

కో || ఏందిరా సరుదుకొనేది యిల్లోవాకిలో? అయినా ఒకనాటిదా; రోజూ సరుదుకుంటూ ఉంటే మనిసిలో జవసత్త్వాలేముంటాయి? ఇట్లా సరుదుకొని సర్దుకోని బతికితే ఆఖరుకు ఆసలుకే సర్దుకోవాలసివస్తుందేమో.

ల || మనకు ఆ అర్ధకూడైనా దొరుకుతున్నది సంతోషించు, అదీలేకగాదూ బెంగాలులో లక్షలాది జనం చచ్చారు?

కో || ఉన్నదంతా ఏదేశాలకో దోచుకొనిపోయి మిలటరోళ్లకు మేపితే, జనం సావకేమిచేస్తారు?

ల || ఇకమనకా కష్టాలుండవు, మన అన్నం మన బట్టా ముందుగా చూస్తారు, మనస్వరాజ్య ప్రభుత్వంవారు.

కో || ఒరే అసలు నీవు కాంగ్రెసుమనిషివీ చదుబుకున్నోడివీ, కాదూ. అన్నీ యిట్లాగే తియ్యంగా చెప్తావు కాని చూడబోతే ఏమీఉండదు. అయితే సరేగాని మనసొరాజ్యప్రభుత్వంవారు మనతెలుగోళ్లకు పత్తేకరాష్ట్రం యివ్వమంటే యివ్వలేదుట సరిగదా ఒకగవనేరుపనిగాని ఒకమంత్రిపనిగాని ఏదీయివ్వలేదుటగా. ఆళ్లు మనందరినీ సిన్నచూపు చూస్తుంటే మనమెందుకు ఆరుచెప్పిన ఉత్సవాలు చెయ్యాలోచెప్పు.

ల || ఇదెవరు చెప్పారు?

కో || మొన్నెవరో బజారులో ఉపన్యాసంలో సెబుతుంటె విన్నానులే. ఆమాట విన్నప్పటినుంచీ మణుసు తుకతుకా ఉడికిపోతున్నది. ఆళ్లు మనతెలుగోళ్లమంచి సూడకుండా మనోళ్లను ఎక్కడా కాలెట్టనీయకుండా ఉంటే ఏందోయి వీరిమాటవినేది?

ల || వాళ్లెవరు? మనమెవరు? స్వరాజ్యమందరిదీకాదూ, నూరేళ్లనుంచీ పోరాడుతూఉంటే నేటికి స్వరాజ్యమంటూవస్తే మనలోమనం కలతలుపెట్టుకుని కూడిరాకపోవడమా, వెనుకా ముందుగా అన్నీవస్తాయి.

ఆరిలాబాలు ఆరు సూసుకుంటూ మనతెలుగోళ్లను ఎందునా చేరనీయకపోతే, మనకుమాత్రం గుబ్బుగాదుట్రా?

కో || అరేలచ్చుమయ్యా అడగమరిసిపోయినా, రాత్రిమాపిల్లగాడన్నాడూ ఆడదానికి గవనేరుపని యిచ్చారటేందిరా, దేశంలో మొగాళ్లు లేనట్టు.

ల || అవును యిచ్చారు. ఒకగవర్నరు పనేగాదు, మంత్రిపనీ. విదేశపు రాయబారపుపనీ, అన్నీ యిచ్చారు.

కో || ఆఁ ఆఁ అన్నీ ఆడవాళ్లకే, సొరాజ్యమంటే ఆడమళయాళమా ఏందిరా!

ల || స్వరాజ్యప్రభుత్వంలో స్త్రీపురుషులకు సమానహక్కులూ, హోదాలుయిచ్చారు, స్త్రీ అనే

కారణంచేత ఏ పనికీతగదని భావించరాదు, ఇవ్వమని నిరాకరించరాదు. మన స్వరాజ్య పోరాటంలో వాళ్లు సమానంగా పాల్గొని కష్టపడ్డవాళ్లేగా.

కో|| పడితేమటుకు అంత సరి సరి, మర్యాదలా? ఇంట్లోవాళ్లు మనతోబాటు కష్టపడుతుంటే సమానంగా సూత్తున్నామా.

సు|| అవునురా ఆడ, మగ, అన్నతర్వాత కాసంతసు కుడీ, యెడమా ఉండనక్కర్లేదా.

ల|| ఇక ఆ పప్పులుడకవు; వాళ్లూ తెలివినపడుతున్నారు.

కో|| సరే, పదరూ. మనమెతకనుబట్టే రొతుమెత్తనైతే గుఱ్ఱం మూడుకాళ్లనడిసిందట!

సు|| అదిసరేగాని లచ్చుమయ్యా సాయిబులు మనలోనుండి యిడిపోయినా రంటున్నారేందిరా.

ల|| అవును.

కో|| ఏందీ, ఏందీ, తురకోరు మనలోనుంచి యిడిపోయినారూ, అళ్లు అందుకే గోలచేత్తున్నారని వింటున్నాంగా.

ల|| ఆ.

కో|| అయితే యింకేం సొరాజ్యమోయ్.

ల|| విడిపోతేనేం నీతమ్ముడు నీలోంచి విడిపోలా.

కో|| విడిపోతేమాత్రం ఇంత గందరగోళాలా.

ల|| ఒక్క తల్లికడుపున బుట్టినాళ్లుగదా. అబ్బో మీరంతకీచులాడుకున్నారు? ఆరోజుల్లో మీయింట్లో ఎట్లాఉండేది, వేళకు అన్నాలున్నాయిగా?

కో|| అయితేనేం, మొన్ననాకు కాస్తవల్లతప్పిందంటే లగెత్తుకువచ్చాడు.

ల|| వీళ్లుమాత్రం?

సు|| అరేపిచ్చిలచ్చుమయ్యా వీళ్లుఅట్లా అపేక్షతో వస్తారంటరా, విడిపడి పోయాక.

ల|| మనమెప్పుడూ మంచినేకోరుదాం. ఐకమత్యమే ఆశిద్దాం, కలిసిరమ్మనే అడుగుదాం. ఆనక వారియిష్టం, అయినా అన్నదమ్ములు విడిబడిపోతే వేరు వేరుగా పండగలు చేసుకుంటారు గాని అసలు మానుకోరుగా. మనస్వరాజ్య ఉత్సవం మనమెందుకు మానుకోవాలి, వారు వేరుపడ్డారనే? చెప్పు.

కో|| అయితే స్వరాజ్యఉత్సవం చేయవలసిందే నంటావు?

ల|| ఆహా! తప్పకుండా చెయ్యవలెనంటాను. వెయ్యేండ్లదాస్యం విచ్ఛిన్నమైపోతుంది. నూరేండ్ల యుద్ధం ఆరిపోతున్నది. సిపాయీల తిరుగుబాటుమొదలుకొనీ ఝాన్సిలక్ష్మిబాయి కాలం నుంచీ నేటివరకు అవిచ్ఛిన్నంగా సాగుతున్న సమరంయిది. దాదాబాయినౌరోజీ, లోకమాన్య గంగాధరతిలక్, లాలా లజపత్రాయి. అజితసింగ్, మోతీలాల్ నెహూౄ, చిత్తరంజనదాస్, సేనుగుప్తా, డాక్టర్ అన్సారీ, మహాదేవ దేశాయ్, నాగేశ్వరరావు పంతులు, విఠల్ భాయి పటేల్, కస్తూరిబాయ్ గాంధి, మదనమోహన మాలవ్యా, ఒకరేమిటి ఎంతమంది ఈ మంచిమాట వినడానికి తపించి తపించి ప్రాణాలువిడిచారు? బోసుబాబు ఎంత ఆవేదనపడి

పరదేశాలపాలైనాడు. ఖుదీరాంబోస్, భగత్సింగ్, శుక్‌దేవ్, రాజగురు ఎందరు ఉరిస్తంభా లెక్కారు. ఈస్వరాజ్యంకోసం, అట్లావాళ్లు తపించి తపించి ప్రాణాలు ధారపోసిన స్వరాజ్యం నేడు వస్తూఉంటే మనంబ్రతికిఉండి మీనమేషాలు లెక్కపెట్టుతూ స్వరాజ్యోత్సవంలో పాల్గొనకపోవడమా? ఏమి సబబయ్యాయిది.


సు॥ అవును నీవు చెప్పినమాటలు, నిజమేగాని యింకా తెల్లదొరల ఆధిపత్యం పూర్తిగాపోలేదంటా రేమిటి, నిజమేనా ?

ల॥ ఈ శంకలకేమి బాబాయి. మనసభలు చేసిన తీర్మానాలే చట్టాలవుతున్నాయి, మనవాళ్లే గవర్నర్లు, మనవాళ్లే మంత్రులు, మనవాడే ప్రెసిడెంటు, సైన్యంమనది, ఖజానామనది, వ్యాపారంమనది, ఈరోజు గవర్నరుజనరల్ మౌంటుబాటెన్, మనస్వరాజ్యజెండాలకు తలవంచి మీప్రభుత్వానికి విధేయుడనంటున్నాడు, ఇంకా ఏంకావాలి? బ్రిటిషువాళ్లతో ఏదో సంబంధమంటున్నావు అదీ. ఎప్పుడు మనం కాదంటే అప్పుడుపోయేదేకాని బాధించేదికాదు. ఇంతైనతరువాత యిక స్వరాజ్యఉత్సవం చేసుకోడానికి ఎందుకు సంకోచించాలె. వెనుదీయాలె. అందుకే యీ స్వాతంత్ర్యోత్సవం అందరు శ్రద్ధతో, భక్తితో, ఉత్సాహంతో ఐకమత్యంతో చేయవలెనని నా అభిప్రాయం, ఏమంటారు?

సు॥ అరే నీవు చెప్పినమాటలువింటే స్వరాజ్యఉత్సవం అందరు చేయాలనిపిస్తున్నదిరా.

కో॥ నాకు అట్లాగే తోస్తావున్నది.

ల॥ అయితే రండిపోదాం స్వతంత్ర భారతికీజయ్ !
మహాత్మాగాంధికీ జయ్.



స్వతంత్ర దేశము
సంతోషింపగ
స్వతంత్ర సంచిక
సకలగృహంబుల
ప్రకాశమొదవగ
ప్రచారమొసగిన
కృపాశాలినివి
గృహలక్ష్మి!

డా॥ పోలాకి శ్రీనివాసరావు.